సాక్షి తిరుపతి

ఆదివారం । 29 । జనవరి । 2023



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.59,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,270
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,200
రిటైల్ వెండి గ్రాము	రూ.72.20

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	31	21
చిత్తూరు	31	19
తిరుమల	27	17
గూడూరు	32	23
నగరి	32	22



రూ.10 లక్షల విరాళం

తిరుమల: ఢిల్లీకి చెందిన రమా సివిల్ ఇండియా కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తరఫున వారి ప్రతినిధి తిరుపతికి చెందిన వై.రాఘవేంద్ర రూ.10 లక్షలను ఎస్వీ బీసీ ట్రస్టుకు విరాళంగా ఇచ్చారు.

న్యూస్‌రీల్

ముక్కంటీశునికి ప్రత్యేక పూజలు



పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

శ్రీకాళహస్తి: రథసప్తమిని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదట ఆలయ అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు వివిధ రకాల అభిషేకాలు నిర్వహించి, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం వేదమంత్రా లు, మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ స్వామి, అమ్మవార్లను చప్పరాలపై అధిష్టింపజేశారు. తర్వాత పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈఓ సాగర్‌బాబు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ తిరుపతి జిల్లా పరిధిలో జిల్లా రిసోర్స్ పర్సన్ (డీఆర్పీ)గా పనిచేయడానికి ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవచ్చని ఉద్యానశాఖ జిల్లా అధికారి దశరథరామిరెడ్డి తెలిపారు. సూక్ష్మ, చిన్న తరహా, కుటీర పరిశ్రమలపై అవగాహన, వాటి స్థాపనకు డీఆర్పీలు కృషి చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నియోజకవర్గానికి ముగ్గురు చొప్పున జిల్లాలో 8 నియోజకవర్గాలకు 24 మందిని తీసుకుంటామన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్, అగ్రికల్చర్, హార్టికల్చర్, ఎంబీఏ కోర్సులు పూర్తిచేసి బ్యాంకింగ్‌పై అవగాహన కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. అంతేకాకుండా డిగ్రీ కోర్సులు చేసి, మార్కెటింగ్, బ్యాంకింగ్ రంగంలో అనుభవం కల్గిన వ్యక్తులు కూడా దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. వివరాలకు తిరుపతి కరకంబాడి రోడ్డులోని జిల్లా ఉద్యానశాఖ కార్యాలయంలో, అలాగే 7995086783 నంబర్‌లోనూ సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

తప్పులకు తావివ్వద్దు



మాట్లాడుతున్న జేసీ డీకే బాలాజీ

తిరుపతి అర్బన్: జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకంలో ఎలాంటి తప్పులకు తావులేకుండా పకడ్బందీగా సర్వే చేపట్టాలని జేసీ బాలాజీ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లాలోని సర్వేయర్లతో డీఆర్వో శ్రీనివాసరావు, సర్వే, ల్యాండ్స్ రికార్డ్సు జిల్లా అధికారి జయరాజ్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. రీ సర్వే గ్రౌండ్ ట్రూథింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్, నోటీలుసు, అప్పీల్స్, అసైన్మెంట్ భూములకు సంబంధించి చేపట్టాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 14 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 59,695 మంది దర్శించుకోగా.. అందులో 30,286 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.4.06 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనమవుతోంది.



తిరుమాడ వీధుల్లో సూర్యప్రభ వాహనంపై విహరిస్తున్న మలయప్ప

తిరువీధుల మెరిసీ..



దేవదేవుడు

- తిరుమలలో వైభవంగా రథసప్తమి
- ఏడు వాహనాలపై విహరించిన మలయప్ప
- ఒక్కరోజు బ్రహ్మోత్సవానికి పోటెత్తిన భక్తులు
- ఆకట్టుకున్న బాలమందిరం విద్యార్థుల ప్రదర్శన

తిరుమల: ఒక్కరోజు బ్రహ్మోత్సవంగా ప్రసిద్ధి పొందిన రథసప్తమి వేడుకలను శనివారం తిరుమలలో అత్యంత రమణీయంగా నిర్వహించారు. పదహారు గంటల్లోనే ఏడు వాహనాలపై మలయప్ప విహరిస్తూ భక్తులను కటాక్షించారు. సూర్యప్రభ, చంద్రప్రభ, గరుడ, హనుమంత, చిన్న శేష వాహనాలపై స్వామివారు ఊరేగగా.. కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై శ్రీదేవి, భూదేవితో కలిసి విహరించారు. భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి తిరుమలేశుని దర్శించి తరించారు.





సూర్యప్రభ వాహన సేవలో సీఎస్ జవహర్‌రెడ్డి దంపతులు, టీటీడీ చైర్మన్ సతీమణి స్వర్ణలత, జేఈఓ

దివ్య తేజం..భక్తజన పరవశం

రథ సప్తమి పర్వదినాన వాహన సేవలను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారు జామున 5.30 గంటలకు ప్రారంభమైన సూర్యప్రభ వాహన సేవ గంట తర్వాత ఉత్తర మాడవీధి ప్రారంభానికి చేరుకుంది. ఉదయం 6.50 గంటలకు ఐదు నిమిషాల పాటు సూర్య కిరణాలు స్వామివారి పాదాలను స్పృశించాయి. భానుడినే వాహనంగా మలుచుకున్న దివ్యతేజోమూర్తి మలయప్పను భక్తులు దర్శించుకుని తన్మయత్వం చెందారు. వాహనం నిలబడిన చోట ఉత్సవ మూర్తికి భక్తులు హారతులు పట్టారు. ఉదయం 7.45 గంటలకు సూర్యప్రభ వాహనం ముగిసింది. తర్వాత 9 గంటలకు చిన్న శేషవాహన సేవ ప్రారంభమైంది. మార్గమధ్యంలో సర్కారు హారతులు మాత్రమే అనుమతించి కేవలం 50 నిమిషాల్లోనే ఊరేగింపు ముగించారు.



ఆకట్టుకున్న కళాకారుల నృత్యం

ఆదిత్యహృదయం.. సూర్యాష్టకం

రథసప్తమి పర్వదినం సందర్భంగా సూర్యప్రభ వాహనసేవలో టీటీడీ శ్రీవేంకటేశ్వర బాలమందిరంలో చదుకుంటున్న వంద మందికి పైగా విద్యార్థులు ఆలపించిన 'ఆదిత్యహృదయం', 'సూర్యాష్టకం' సంస్కృత శ్లోకాలు భక్తులను ఆధ్యాత్మిక సాగరంలో ముంచెత్తాయి. ఉత్తర మాడ వీధిలోకి సూర్యప్రభ వాహనం వచ్చిన తర్వాత విద్యార్థులు లయబద్ధంగా శ్లోకాలు ఆలపించారు. గతంలో జరిగిన శ్రీవారి బ్రహ్మోత్సవాల్లోనూ విద్యార్థులు శ్రీనివాస గద్యం తదితర సంస్కృత శ్లోకాలు ఆలపించి ఆకట్టుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్.జవహర్‌రెడ్డి దంపతులు, బోర్డు సభ్యులు పోకల అశోక్‌కుమార్, జేఈఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహ కిషోర్, ఎఫ్‌ఏసీఏఓ బాలాజీ, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఆలయ డిప్యూటీ ఈఓ రమేష్‌బాబు ఇతర టీటీడీ అధికారులు ఈ వాహన సేవల్లో పాల్గొన్నారు.

కోలాహలంగా గరుడ సేవ

ఉదయం 11గంటలకు గరుడ వాహన సేవ కోలాహలంగా సాగింది. మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రారంభమైన హనుమంత వాహనం సరిగ్గా రెండు గంటలకే ముగించారు. అనంతరం మధ్యాహ్నం 2.20 గంటలకు సుదర్శన చక్రత్తాళ్వార్ శ్రీవారి సన్నిధి నుంచి ఊరేగింపుగా వరాహస్వామి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ వైదిక కార్యక్రమాలు పూర్తిచేసిన తర్వాత పుష్కరిణిలో శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు కల్పవృక్ష వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్ప పురవీధుల్లో విహరించారు. 6 గంటలకు సర్వభూపాల వాహనం, చివరగా రాత్రి 8గంటలకు చంద్రప్రభ వాహనంపై మలయప్ప కటాక్షించారు.



చక్రస్నానానికి పోటెత్తిన భక్తజనం

2 లక్షల మందికిపై భక్తుల రాక

ఈ సారి రథసప్తమికి భక్తులు పోటెత్తారు. తెల్లవారు జామున 5.30 గంటలకు ప్రారంభమైన సూర్యప్రభ వాహన సేవకు ముందుగానే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయ ప్రాంతానికి చేరుకున్నారు. వాహనసేవల్లో సుమారు 2 లక్షల మందికి పైగా భక్తులు పాల్గొన్నట్టు అధికారులు అంచానా వేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కళా ప్రదర్శనలు



రథసప్తమి సందర్భంగా నిర్వహించిన సంగీత, సాంస్కృతిక కళా బృందాల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇందులో కర్ణాటక రాష్ట్రం ఉడిపి డప్పు వాయిద్య కళాకారుల విన్యాసం భక్తులను మంత్రముగ్దులను చేసింది. కోలాటాలు, చెక్క భజనలు, వివిధ దేవతామూర్తుల వేషధారణల్లోని కళాకారుల అభినయం భక్తులను ఆనంద డోలికల్లో ముంచెత్తింది.

పెద్ద ఎత్తున ఆహార పొట్లాల పంపిణీ



భక్తులకు అన్నప్రసాదాల పంపిణీ

రథసప్తమి సందర్భంగా ఆలయ నాలుగు మాడ వీధులు, దర్శనం కోసం వేచి ఉన్న క్యూల్లోని భక్తులకు లక్షకుపైగా ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. పులిహోర, సాంబారు అన్నం, పెరుగు అన్నం, ఉప్మా, పాలు, టీ, కాఫీ, మజ్జిగ సరఫరా చేశారు. టీటీడీ క్యాటరింగ్ ఆఫీసర్ శాస్త్రి ఆలయ వీధులు, క్యూలు తిరుగుతూ అన్నప్రసాద పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



సూర్యప్రభ వాహనంపై తేజోమయుడు



చిన్న శేష వాహన సేవ



గరుడ వాహనంపై మలయప్ప



హనుమంత వాహన సేవ



కల్పవృక్ష వాహనంపై స్వామి, అమ్మవార్లు



సర్వభూపాల వాహన సేవ



చంద్రప్రభ వాహనంపై శ్రీనివాసుడు

కేన్సర్ నివారణ, చికిత్సకు ప్రాధాన్యం

తిరుపతి అలిపిరి: కేన్సర్ నివారణ, చికిత్సకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్.జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం మధ్యాహ్నం స్థానిక శ్రీపద్మావతీ అతిథిగృహంలో ఎస్వీ ఆయుర్వేద, స్విమ్స్, టాటా కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ (స్వికార్), పద్మావతీ చిన్న పిల్లల హృదయాలయ ఆస్పత్రుల డాక్టర్లు, తిరుపతి, చిత్తూరు జిల్లాల కలెక్టర్లు కే.వెంకటరమణారెడ్డి, ఎం.హరినారాయణన్‌తో కలిసి ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వమించారు. సీఎస్ మాట్లాడుతూ వైద్యరంగంలో తిరుపతి విశాఖతో సమానంగా ఉందన్నారు. ఖర్చుతో కూడిన కేన్సర్ చికిత్సకు అధికారులు సమన్వయంతో పనిచేసి రోగులకు సేవలందించాలని సూచించారు. ప్రతి రెండు వేల మంది జనాభాకు ఒక సచివాలయం, అందులో ఏఎన్ఎం, ఎండీహెచ్, మరో ఏఎన్ఎం అందుబాటులో ఉన్నారని, వీరి సహాయంతో ఆస్పత్రుల క్యాంపుల నిర్వహణ, 'సహకరించండి-తెలపండి' నినాదంతో కేన్సర్ పేషెంట్ల గుర్తింపు జరగాలన్నారు. ఎస్వీయూ ఆయుర్వేద శాఖ ఆధ్వర్యంలో నరసింగాపురం వద్ద 63 రకాల మందులు ప్రారంభించడానికి సిద్ధం కావడం శుభసూచికమన్నారు. స్విమ్స్ డాక్టర్ జయచంద్రారెడ్డి, డాక్టర్ రామ్, స్వికార్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి, చిన్నపిల్లల ఆస్పత్రి డాక్టర్ శ్రీనాథరెడ్డి, ఎస్వీ ఆయుర్వేదిక్ వైద్యశాల సూపరింటెండెంట్ రేణుదీక్షిత, ఆర్డీఓ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



కలెక్టర్లు, ఆస్పత్రుల ప్రతినిధులతో సమీక్షిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న టీటీడీ డీఈఓ

తిరుపతి ఎడ్యుకేషన్: స్థానిక ఎస్వీ ఆర్ట్స్ కళాశాల మైదానంలో శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్ర స్థాయి బాలబాలికల ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. టీటీడీ డీఈఓ భాస్కర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి జయరామయ్య మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు 13 జిల్లాల నుంచి బాలుర విభాగంలో 12 జట్లు, బాలికల విభాగంలో 8 జట్లు హాజరైనట్లు తెలిపారు.

11,224 మందికి ఆధార్ సేవలు

తిరుపతి అర్బన్: జిల్లా వ్యాప్తంగా ఈనెల 23, 24 తేదీల్లో 82 సచివాలయాల పరిధిలో నిర్వహించిన ప్రత్యేక క్యాంప్‌లో 11,224 మందికి ఆధార్ సేవలు అందించినట్లు డీఎల్‌డీఓ సుశీలాదేవి తెలిపారు. ఆమె శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత ఏడాది నాలుగు నెలల్లోనే 1,34,000 మందికి ఆధార్ సేవలందించినట్టు వివరించారు.

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య


జ్యోతి మృతదేహం

నారాయణవనం : బీటెక్ తృతీయ సంవత్సరం విద్యార్థిని కళాశాల హాస్టల్‌లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం సాయంత్రం నారాయణవనం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు అన్నమయ్య జిల్లా సుండుపల్లి మండలం, కురవపల్లెకు చెందిన జనార్దన్‌రెడ్డి కుమార్తె జ్యోతి (20) మండలంలోని ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ తృతీయ సంవత్సరం చదువుతోంది. కళాశాల హాస్టల్‌లో ఉంటున్న జ్యోతి శనివారం తరగతులకు వెళ్లకుండా హాస్టల్ గదిలోనే ఉండిపోయింది. కళాశాల ముగిసిన తర్వాత 4.15 గంటల సమయంలో జ్యోతి ఉరి వేసుకున్నట్టు హాస్టల్ విద్యార్థినులు గుర్తించి అధ్యాపకులకు సమాచారమిచ్చారు. జ్యోతిని వెంటనే పుత్తూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్య సిబ్బంది నిర్ధారించారు. జ్యోతి శనివారం అందరితో సాధారణంగానే మాట్లాడిందని, మధ్యాహ్నం తనతో కూడా మామూలుగానే మాట్లాడిందని ఆమె అన్న జశ్వంత్ తెలిపారు. జ్యోతి ఆత్మహత్యకు గల కారణాలు విచారణలో తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

30న వాహనాల వేలం

శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలోని ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 30 సోమవారం ఉదయం 10.30 గంటలకు వేలం వేయనున్నట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ పీటీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. జీఎస్టీ రిజిస్ట్రేషన్ కలిగిన వారు నిర్దేశించిన ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని చెప్పారు. పూర్తి వివరాలకు శ్రీకాళహస్తి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో సంప్రదించాలని అన్నారు.

వెటర్నరీ వర్సిటీ మెట్లే నాకు పునాదిరాళ్లు


ఆత్మీయ సభలో ప్రసంగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి


వేదిక వద్ద తీర్చిదిద్దిన తన ముఖచిత్రాన్ని తిలకిస్తున్న జవహర్‌రెడ్డి

- సహచరులు, గురువులను కలవడం మధుర జ్ఞాపకం
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి వెల్లడి

తిరుచానూరు: శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయమే తన ఎదుగుదలకు పునాదిగా నిలిచిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి స్పష్టం చేశారు. వెటర్నరీ వర్సిటీలో శనివారం సాయంత్రం పూర్వవిద్యార్థుల అసోసియేషన్, పూర్వ అధ్యాపకులు, ప్రస్తుత విద్యార్థులు, అధ్యాపకుల ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఆత్మీయ సన్మానసభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హోదాలో జవహర్‌రెడ్డి తొలిసారిగా వర్సిటీకి విచ్చేస్తుండడంతో సభా వేదిక సమీపంలో అద్భుత రీతిలో ఆయన ముఖచిత్రాన్ని తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తోటి పూర్వ విద్యార్థులను, గురువులను కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. తిరుపతి వెటర్నరీ వర్సిటీ నుంచే తన భవిష్యత్తు ప్రారంభమైందన్నారు. యూనివర్సిటీకి ఒక్కరోజు వైస్ చాన్సలర్‌గా పనిచేశానని గుర్తుచేసుకున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో పనిచేయడం తనకు తీపిగుర్తు అని పేర్కొన్నారు. ఆరోగ్య శాఖలో పనిచేసిన సమయంలో కరోనా పరిస్థితుల్లో రాష్ట్రంలో కేవలం స్విమ్స్‌లో మాత్రమే పరీక్షలు నిర్వహించేందుకు వీలు ఉండేదన్నారు. రాష్ట్రంలో ఆరు నుంచి ఏడు నెలల్లోనే వైరాలజీ ల్యాబ్‌లను ఎక్కువగా ప్రారంభించానని తెలిపారు. తన వెటర్నరీ విద్యే ఇందుకు ప్రధాన కారణమని అని చెప్పడానికి గర్వపడుతున్నారని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డిని పలువురు జ్ఞాపికలు, దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు.

వైభవంగా భావనారుషి కల్యాణం

నారాయణవనం : స్థానిక భావనారుషి ఆలయంలో శనివారం భద్రావతితో భావనారుషి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉత్సవర్లను ఉదయం పల్లకీ సేవలో, రాత్రి వ్యాఘ్ర వాహనంపై ఊరేగించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భద్రావతీ, భావనారుషికి కు నిర్వహించిన ఆర్జిత కల్యాణంలో దంపతులు పాల్గొని తీర్థ ప్రసాదాలను అందుకున్నారు.

ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని సీతారాంపేట వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి స్వల్ప గాయాలైనట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి చెప్పారు. శ్రీకాళహస్తి నుంచి తిరుపతి వైపు వెళుతున్న కారును సీతారాంపేట సమీపంలో ఎదురుగా వస్తున్న మినీ లగేజీ వ్యాను ఢీకొంది. ఈ ఘటనల కారు డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కారు ముందు భాగం ధ్వంసమైంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పల్లికొండేశ్వరుని సేవలో జిల్లా జడ్జి


జడ్జికి తీర్థప్రసాదాలు అందజేస్తున్న అర్చకుడు

పిచ్చాటూరు: సురుటపల్లిలో వెలసిన మంగళాదేవి సమేత పల్లికొండేశ్వర స్వామిని శనివారం తిరుపతి జిల్లా జడ్జి నాగరాజు దర్శించుకున్నారు. అర్చకులు కార్తికేయ గురుక్కళ్ స్వాగతం పలికి స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు.

జగనన్న కాలనీలో విద్యుత్ పనులు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని జగనన్న కాలనీలో (బీడీకాలనీ) విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ కాలనీలో 434 ఇళ్లు నిర్మిస్తున్నారు. ఇప్పటికే చాలా వరకు ఇంటి నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇటీవల సీఎం వైఎస్ జగన్ జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు. అలాగే కాలనీలో పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ అధికారులు ప్రతి వీధికి లైన్లు లాగుతున్నారు. పలు చోట్ల ట్రాన్స్‌ఫార్మలు ఏర్పాటు చేశారు.

డ్వాక్రా మహిళలు ఆదర్శం


మాట్లాడుతున్న సెర్ప్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటీవ్ శ్రీనివాసులు

శ్రీకాళహస్తి రూరల్: ఏపీలో డ్వాక్రా మహిళలు వివిధ రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నారని సెర్ప్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటీవ్ శ్రీనివాసులు కొనియాడారు. మండలంలోని స్త్రీశక్తి భవనంలో గత 23వ తేదీ నుంచి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలోతి తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, నెల్లూరు, అనంతపురం, సత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లకు జరుగుతున్న లోకోస్ యాప్ శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. మన రాష్ట్రంలో ఎంపిక చేసిన సీఆర్‌పీలు జాతీయ గ్రామీణ జీవనోపాధులు మిషన్‌లో భాగంగా ఇతర రాష్ట్రాలలో సంఘాలు ఏర్పాటు, బలోపేతంపై ఇప్పటికీ పనిచేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం సంఘాల లావాదేవీలు, మొబైల్ బుక్‌కీపింగ్ ద్వారా ఆన్‌లైన్ చేయడంలో దేశంలో మనమే ఆదర్శంగా ఉన్నామన్నారు. సెర్ప్‌తో ఎన్ఆర్ఎల్ఎం వారి ఒప్పందం ప్రకారం మహిళా సంఘాల్లోని సభ్యులు ఇతర రాష్ట్రాలలో పనిచేయడానికి ఆసక్తి కలిగి వారిని గుర్తించి వారికి మొబైల్ ద్వారా సంఘాల లావాదేవీలు లోకోస్ యాప్‌లో ఏ విధంగా చేయాలో ఆరు రోజులపాటు శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. శిక్షణ పొందిన వారు 15 రోజులు వారి సొంత గ్రామాలలో పూర్తి స్థాయిలో తర్ఫీదు పొందిన తర్వాత మళ్లీ ఆరు రోజులు శిక్షణ ఇచ్చి అందులో ఇతర రాష్ట్రాలలో పనిచేయడానికి పంపుతామని చెప్పారు. ఏరియా కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.డాంగేయాదవ్, ఏపీఎం మునెయ్య, సీసీ శ్రీనివాసులు, ఎల్‌సీసీలు గెరటారెడ్డి, శంకర్, లక్ష్మి పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి వారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలశాఖ స్పెషల్ సీఎస్ కరికాలవలవెన్, రాష్ట్రపతి ఓఎస్డీ ఎన్‌సీ చంద్రశేఖర్, న్యూఢిల్లీ ఐటీ కమిషనర్ డాక్టర్ ఎం.మాధవి ఉన్నారు. అనంతరం వారికి ఆలయ అధికారులు గురుదక్షిణామూర్తి సన్నిధిలో స్వామి, అమ్మవార్ల లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

ఆలయ నిర్మాణానికి స్థల పరిశీలన


గుత్తివారిపల్లె వీరాంజనేయస్వామి ఆలయానికి స్థల పరిశీలన చేస్తున్న తహసీల్దార్ శివప్రసాద్

రేణిగుంట: హైవే విస్తరణలో భాగంగా మండలంలోని గుత్తివారిపల్లె శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో కొంతభాగం కోల్పోతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ విషయమై శనివారం తహసీల్దార్ శివప్రసాద్ స్థల పరిశీలన చేశారు. గ్రామస్తుల వినతి మేరకు జేసీ బాలాజీ ఆదేశాలతో ఆయన గుత్తివారిపల్లెకు చేరుకుని స్థానికులతో చర్చించారు. ఆలయ గర్భగుడి మినహా మిగిలిన స్థలం రోడ్డు విస్తరణలో కోల్పోతుండడంతో స్థానికులు ప్రత్యామ్నాయంగా ప్రస్తుతం ఆలయానికి తూర్పుగా హైవే రోడ్డు, సర్వీసు రోడ్డుకు మధ్యలో ఉన్న ప్రభుత్వ స్థలంలో నూతన ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. స్థల కేటాయింపుపై హైవే నిర్మాణ కాంట్రాక్టు ప్రతినిధులతో చర్చించారు. దీనిపై గ్రామంలోని పెద్దలంతా చర్చించి తగు తీర్మానం చేసి తమకు తెలియజేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అందరికీ ఆమోదయోగ్యమైన స్థలాన్ని కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు తహసీల్దార్ వివరించారు. అనంతరం తహసీల్దార్ ఆలయాన్ని దర్శించారు. ఆయనకు ఆలయ పెద్దలు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎంతో ప్రాచుర్యం కలిగిన ఆలయ పునర్నిర్మాణానికి స్థలం కేటాయింపుకై చొరవ తీసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి స్థానికులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, సర్పంచ్ మంజుల, దేవరాజులురెడ్డి, జి.సురేష్, విద్యాకమిటీ చైర్మన్ జి.సుబ్రమణ్యం, చెంగారెడ్డి, జి.వాసు, కె.మునిరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు ఉమ, జి.గురవయ్య, ఢిల్లీరెడ్డి, ఎం.బాబు, వై.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.